క్లుప్తంగా

15, 16వ తేదీల్లో డిగ్రీ స్పాట్ అడ్మిషన్లు

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ కోర్సులు బీఏ, బీకాం, బీఎస్సీ, బీఏ ఆనర్స్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఈనెల 15, 16వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియను చేపట్టనున్నట్లు ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత విద్యార్థులు సర్టిఫికెట్లతో స్పాట్ ప్రవేశాలకు హాజరుకావాలని సూచించారు.

సీకేఎం కళాశాలలో..

న్యూశాయంపేట: దేశాయిపేటలోని సీకేఎం ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సుల్లో మిగిలిపోయిన సీట్లను భర్తీ చేసేందుకు ఈనెల 15, 16వ తేదీల్లో స్పాట్ ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ.ధర్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్ల వివరాలను దోస్త్ వెబ్‌సైట్‌లో, కళాశాల నోటీసు బోర్డులో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఒరిజినల్ టీసీతో పాటు ఇతర ధ్రువీకరణ పత్రాలతో స్పాట్ కౌన్సిలింగ్ హాజరు కావాలని సూచించారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలని కోరారు.

ఉత్తుత్తి నోటీసులు

వరంగల్ చౌరస్తా: వినాయక చవితిని పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ కూరగాయల మార్కెట్‌లో నిర్వహించిన వేలంపాటల్లో పాల్గొన్న కమీషన్ ఏజెంట్లకు జారీ చేసిన నోటీసులు తూతూమంత్రంగా మారాయి. వేలంపాట.. మార్కెట్ బైలాకు విరుద్ధమని, నిషేధమని, వేలంలో పాల్గొన్న వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించి హడావుడి చేసిన అధికారుల మాటలు, జారీ చేసిన నోటీసులు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయి. వేలంలో ఆర్థిక లావాదేవీలకు కూడా లెక్కాపత్రం లేదని కొంత మంది కమీషన్ ఏజెంట్లు బాహాటంగా విమర్శిస్తున్నారు. కాగా, మారోమారు వేలం నిర్వహించబోమని కూరగాయాల వర్తక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు రాత పూర్వకంగా సమాధానం ఇచ్చినట్లు చెబుతున్నారు. అయితే, నోటీసులు అందుకున్న కమీషన్ ఏజెంట్లపై చర్యలు తీసుకునేందుకు రాజకీయ ఒత్తిళ్లతో అధికారులు వెనుకాడుతున్నట్లు సమాచారం.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ఖిలా వరంగల్: వరంగల్ పడమరకోట అగర్త చెరువు వద్ద హిందూ శ్మశాన వాటికకు వచ్చే మృతుల కుటుంబీకులు, బంధువులు నీటి కోసం అరిగోస పడుతున్నారు. ఈ క్రమంలో సమస్యను స్థానికులు కార్పొరేటర్ బైరబోయిన ఉమ దృష్టికి తీసుకెళ్లారు. దాంతో ఆమె స్పందించి నూతనంగా బోరు వేసి నీటి సమస్యను పరిష్కరించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ దామోదర్ యాదవ్, సులగం వేణుగోపాల్, సారంగపాణి, రవీందర్, మల్లేశం, రాజు, ఎల్లయ్య, జగదీష్ పాల్గొన్నారు.

చేనేత సమస్యలు పరిష్కరించాలి

న్యూశాయంపేట: రాష్ట్రంలో చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 22 నెలలు గడుస్తున్నా చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు. చేనేత కార్మికులకు రూ.లక్ష వరకు రుణ మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిధులు కూడా విడుదల చేసినట్టు ప్రకటించినా నేటికీ రుణమాఫీ కాలేదని పేర్కొన్నారు. సహకార సంఘాలకు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని సూచించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

వరంగల్ చౌరస్తా: గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఇంతేజార్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు 50 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని ఎంజీఎం మార్చురీలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసినవారు 8712685007 నంబర్‌లో సంప్రదించాలని వారు కోరారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు

ఖిలా వరంగల్: ఓ బిర్యానీ సెంటర్‌లో లెగ్ పీస్ వేయలేదన్న కారణంతో నిర్వాహకుడితోపాటు అడ్డుకున్న వారిపై ఓ వ్యక్తి దాడి చేశాడు. ఈ మేరకు బాధితుడు ఎండీ.యాకూబ్ ఫిర్యాదు మేరకు రంగశాయిపేటకు చెందిన కరాటే మాస్టర్ లామ్ వెంకటేశ్వర్లుపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.

పోలీసులపై తిరగబడిన వ్యక్తిపై..

మడికొండ: మడికొండలోని ఎంఎన్ఆర్ కాలనీలో బుడగ జంగాల కాలనీకి చెందిన వారు రెండు వర్గాలుగా విడిపోయి శుక్రవారం గొడవ పడ్డారు. సమాచారం అందుకున్న ఎస్సై రాజ్ కుమార్ అక్కడికి వెళ్లి గొడవను ఆపడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో తూర్పాటి విజయ్ అనే వ్యక్తి పోలీసులపైకి తిరగబడి విధులకు ఆటంకం కలిగించాడు. ఎస్సై ఫిర్యాదు మేరకు అతడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

ఖిలా వరంగల్: పక్షవాతంతో బాధపడుతున్న ఓ వ్యక్తి గురువారం అదృశ్యమైనట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు. వరంగల్ శివనగర్ చెందిన 56 ఏళ్ల పూజారి రవి పక్షవాతంతో బాధపడుతూ గురువారం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. రవి కుమారుడు యశ్వంత్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ బొల్లం రమేష్ తెలిపారు.

ప్రమాద బీమా.. జీవితానికి ధీమా

- తక్కువ ప్రీమియంతో ప్రమాద బీమా
- విస్తృత ప్రచారంలో తపాలా శాఖ



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందిస్తున్న సూపరింటెండెంట్ రవీందర్ (ఫైల్)

ఖిలా వరంగల్: రోడ్డు ప్రమాదాలు, ఇతర ఘటనల్లో చాలామంది జీవితాలు అర్ధంతరంగా ముగిస్తున్నాయి. దాంతో వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. పేద, మధ్య తరగతి ప్రజలపై ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. కుటుంబ సభ్యులను ఆదుకోవడానికి కేంద్రం కొన్ని ప్రమాద బీమాలు అమల్లోకి తెచ్చింది. అందులో తపాలా శాఖలో ప్రమాద బీమాలో భాగంగా పరిహారం రూ.10 లక్షలు, రూ.15 లక్షలను అందిస్తోంది. ఈ పథకాన్ని తపాలా బ్యాంకు, గ్రామీణ తపాలా కార్యాలయాల్లో అమలు చేస్తున్నారు.

తక్కువ ప్రీమియంతో..

గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీ పేరిట తపాలా శాఖ ఈ పథకాన్ని రెండేళ్ల క్రితం తపాలా శాఖ ప్రవేశ పెట్టింది. ఇందులో రెండు రకాల ప్రీమియాలు ఉన్నాయి. రూ.520 చెల్లిస్తే సంవత్సరం లోపు ప్రమాదవశాత్తు మరణిస్తే బాధిత కుటుంబానికి రూ.పది లక్షలు అందిస్తారు. రూ.749తో బీమా తీసుకుంటే రూ.15 లక్షల పరిహారం చెల్లిస్తారు. ప్రమాదంలో వైకల్యం చెందితే రూ.పది లక్షలు అందిస్తారు. ఆస్పత్రిలో చేరితే చికిత్స కోసం కొంత డబ్బు ఇస్తారు. మృతుడి పిల్లల చదువులకు ఏడాదికయ్యే ఖర్చును అదనపు సాయంగా అందిస్తారు. ఇప్పటి వరకు ప్రమాదాల్లో మృతి చెందిన కుటుంబాలకు ఈ పరిహారం అందించినట్లు వరంగల్ డివిజన్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు.

విస్తృత ప్రచారం..

బీమా పథకం పట్ల ప్రచారం చేపట్టాలని తపాలా అధికారులు సిబ్బందికి దిశానిర్దేశం చేస్తున్నారు. వీలైనంత ఎక్కువ మందికి బీమాను అమలు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

ఇలా పొందండి..

ఈ బీమా తీసుకునేందుకు 18 నుంచి 65 ఏళ్ల వయస్సు గల వారు అర్హులు. తమ ఆధార్ కార్డు తీసుకెళ్లి రూ.200 లేదా రూ.500తో తపాలా బ్యాంకు ఖాతా తెరవాలి. రెండు నిమిషాల్లో సిబ్బంది ఖాతా తెరిచి క్యూఆర్ కోడ్‌తో ఉన్న కార్డు అందజేస్తారు. రూ.520 లేదా రూ.749తో బీమా తీసుకోవాల్సి ఉంటుంది. ఇది ఏడాదికి ఒక్కసారి మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది.

సద్వినియోగం చేసుకోవాలి



తపాలా శాఖ ద్వారా తక్కువ ప్రీమియంతో ప్రభుత్వం తెచ్చిన ప్రమాద బీమా పాలసీలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. దీనిపై ప్రజలకు సిబ్బంది ద్వారా అవగాహన కల్పిస్తున్నాం. ఇటీవల ప్రమాదంలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు ధీమా కల్పిస్తూ బీమా చెక్కులు అందజేస్తున్నాం. ఇంటి వద్దనే ప్రమాద బీమా పాలసీ తీసుకునే అవకాశం కల్పిస్తున్నాం.

\- రవికుమార్, తపాలా శాఖ సూపరింటెండెంట్, వరంగల్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 13న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని టీజీ ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. అజరా ఆస్పత్రి, రియా ఆస్పత్రి, ములుగు రోడ్డు, ఎస్‌వీపీ రోడ్డు, న్యూ కాపువాడ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బాలసముద్రం సబ్‌స్టేషన్ ప్రాంతంలో ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, న్యూ శాయంపేట, కేయూసీ, పెద్దమ్మగడ్డ, ఆర్ఈసీ, వడ్డెపల్లి, మడికొండ, రాంపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు, సోమిడి, వెస్ట్ సిటీ, కడిపికొండ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు తెలిపారు.

అలాగే, వరంగల్‌లోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ పేర్కొన్నారు. ఆజంజాహి మిల్, ఆరెపల్లి, కరీమాబాద్, శంభునిపేట, మామునూరు, గొర్రెకుంట, పోతన, ఖిలా వరంగల్ సబ్ స్టేషన్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. దేశాయిపేట, మహారాజుల కాలనీ, బాలాజీ నగర్ జంక్షన్, నజ్రత్‌పుర, షాదీఖానా, భారత్ గ్యాస్ గోడౌన్, తిలక్ రోడ్డు, మోహింపుర, ఏఎం - పీఎం హోటల్, నర్సంపేట రోడ్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ కోత విధించనున్నట్లు మల్లికార్జున్ తెలిపారు.

నిరంతర అధ్యయనం అవసరం



హిందీ దివస్‌లో మాట్లాడుతున్న సంజీవ

కేయూ క్యాంపస్: భాష నేర్చుకునేందుకు నిరంతరం అధ్యయనం చేయాలని కాకతీయ యూనివర్సిటీ హిందీ విభాగం పూర్వ ఆచార్యులు సంజీవ అన్నారు. జాతీయ హిందీ దినోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో హిందీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన హిందీ దివస్‌లో ఆయన మాట్లాడారు. ప్రపంచ వ్యాపితంగా సుమారు ఆరువేల మిలియన్ల ప్రజలు హిందీభాషను మాట్లాడుతున్నారని చెప్పారు. ఇది ప్రపంచభాషగా గుర్తింపు పొందిందని గుర్తుచేశారు. పరిపాలకులు ఎవరు ఉంటే వారికి అనుకూలమైన భాషను రాజభాషగా అమలు పరుస్తారన్నారు. భాష అనేది వ్యక్తుల మధ్య అవినాభావ సంబంధాన్ని పెంపొందించేందుకు దోహద పడుతుందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి మాట్లాడుతూ దేశంలో 60శాతం మంది ప్రజలు హిందీ మాట్లాడుతున్నారని వివరించారు. సమావేశంలో హిందీ విభాగం అధిపతి డాక్టర్ రమాదేవి, అధ్యాపకురాలు డాక్టర్ పరహా ఫాతిమా, వైస్ ప్రిన్సిపాల్ రెహమాన్, డాక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

నయీంనగర్: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. 53వ డివిజన్ సరస్వతి నగర్‌లో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో వర్షాకాలం వస్తే వరదలో హనుమకొండ అనే పతాక శీర్షికలు ఉండేవని, ఇప్పుడు ఒకటి, రెండు మినహా వరద ప్రభావిత ప్రాంతాలు లేకుండా అభివృద్ధి చేసినట్లు ఎమ్మెల్యే వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సోదా కిరణ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎర్ర మహేందర్, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

హన్మకొండ చౌరస్తా: రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తూ, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని 4వ డివిజన్ పరిధిలోని జ్యోతిబసునగర్ సీసీ రోడ్డు, డ్రెయినేజీ పనులకు ఎమ్మెల్యే శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం కాలనీలో పర్యటించి స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ కార్పొరేటర్ బోడ డిన్నా, పార్టీ 4వ డివిజన్ అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్, రాజు పాల్గొన్నారు.

డీటీఓకు అభినందనలు



సన్మానిస్తున్న ఉద్యోగ సంఘాల నేతలు

హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన డీటీఓ ఆకవరం శ్రీనివాస్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో జిల్లా జేఏసీ చైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఆకుల రాజేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగ సంఘాల నేతలు గజమాలతో శుక్రవారం సత్కరించి అభినందనలు తెలిపారు. టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి బైరి సోమయ్య, కోశాధికారి పనికెల రాజేష్, గౌరవ అధ్యక్షుడు శ్యాంసుందర్, ఖజానా శాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, అన్వర్, చంద్రశేఖర్, కేంద్ర సంఘం నేతలు రామునాయక్, లక్ష్మీప్రసాద్, జిల్లా నేతలు సురేష్, రాజమౌళి, రాజేష్ ఖన్నా, రాజీవ్, ప్రణయ్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ హర్నాత్ దివి

ఖిలా వరంగల్: విద్యార్థులు చదువుతోపాటు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని కేంద్రీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్) ప్రొఫెసర్ హర్నాత్ దివి సూచించారు. వరంగల్ ఉర్సు గుట్ట రోడ్డులోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో హెచ్ఎం సరితరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థి నాయకుల బాధ్యతల స్వీకారోత్సవం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా హర్నాత్ దివి మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. కృషితో ఉన్నత లక్ష్యాలను సాధించి భవిష్యత్‌లో సమాజానికి దోహదపడే విధంగా ముందుకు సాగాలన్నారు. అనంతరం క్రీడల్లో రాణించి విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు వివేక్, వర్షిత రెడ్డి పాల్గొన్నారు.

22 నుంచి పద్మాక్షి శరన్నవరాత్రోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, తదితరులు

హన్మకొండ అర్బన్: ఈనెల 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి పద్మాక్షిదేవి ఆలయంలో అమ్మవారికి దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు నాగిళ్ల శంకర్ శర్మ, నాగిళ్ల షణ్ముఖ పద్మనాభ అవధాని తెలిపారు. ఈ మేరకు నవరాత్రోత్సవాలకు సంబంధించిన కరపత్రాలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ చేతుల మీదుగా శుక్రవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దేవాలయ అభివృద్ధి కమిటీ బాధ్యులు నీలారపు రాజ్‌కుమార్, బంగారు సదానందం, తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



ఫిక్స్‌డ్ డిపాజిట్ పత్రాలు అందజేస్తున్న ఏసీపీ

వరంగల్ క్రైం: హనుమకొండ ట్రాఫిక్ విభాగంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ భార్య ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతిచెందారు. ఈ క్రమంలో ఆమె చికిత్సకు వైద్య ఖర్చులు అధికమవ్వడంతో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి పిలుపు మేరకు సహోద్యోగులు, ట్రాఫిక్ సిబ్బంది అందించిన రూ.72 వేలను ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఆ పత్రాలను ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ చేతుల మీదుగా శ్రీనివాస్ పిల్లలకు శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా నిరుపేద హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం అందించిన ట్రాఫిక్ సిబ్బందిని ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి, ఎస్సైలు కొమురెల్లి, ఫసియొద్దీన్, విజయ్‌కుమార్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్‌తో వ్యక్తిత్వ వికాసం పెంపు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీధర్

విద్యారణ్యపురి: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్)తో సామాజిక సేవా దృక్పథంతో పాటు వ్యక్తిత్వ వికాసం పెంపొందుతుందని హనుమకొండ ప్రభుత్వ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ తెలిపారు. ఈ మేకు విద్యార్థులు వలంటీర్లుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో ఎన్ఎస్ఎస్‌పై నూతన విద్యార్థులకు శుక్రవారం అవగాహన కల్పించారు. సమావేశంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సవాసి శ్రీనివాస్, స్టూడెంట్స్ కౌన్సిలర్లు డాక్టర్ రవి, రేణుక పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్ బాబు

ఖిలా వరంగల్: వచ్చే నెల 2న జరగనున్న దసరా ఉత్సవాలను విజయవంతం చేయాలని రంగలీల మైదానం దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపూరి సంజయ్ బాబు గౌడ్, మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్న కోరారు. వరంగల్ కరీమాబాద్ రోడ్డులోని ఆదర్శ ట్రస్ట్ భవనంలో ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గత సంవత్సరం నిర్వహించిన సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలు ఎంతో ప్రాచుర్యం పొందాయని గుర్తుచేశారు. ఈ ఏడాది కూడా ప్రజా ప్రతినిధులు, అధికారులు, దాతల సహకారంతో వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ ప్రతినిధులు రంజిత్‌గౌడ్, అనిల్‌కుమార్, సందీప్, వెంకటేశ్వర్లు, అజయ్, సందీప్, వాసు, నాగపూరి అశోక్, నాగరాజు, సంతోష్, బత్తిని రంజిత్, కస్తూరి వంశీ, గట్టు రమేష్, సతీష్, మనోహర్, నరేందర్, వంశీ, వినయ్, రాజశేఖర్, నాగరాజు, రవీందర్, బాలసాయి, శ్రీధర్, నవీన్ పాల్గొన్నారు.

ఏచూరికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

న్యూశాయంపేట: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతిని హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు వెంకట్ మాట్లాడుతూ సమసమాజ స్థాపనకు వర్గ ఉద్యమాలు చేపట్టడమే సీతారాంకు నిజమైన నివాళి అని పేర్కొన్నారు. శాఖా కార్యదర్శి ఎం.రమ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు విజేందర్, సుదర్శన్, రాధిక, స్వాతి, ప్రశాంత్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

వీధి కుక్కల పట్టివేత



కాజీపేట: కాజీపేట పట్టణంలో పలు వేర్వేరు బృందాలు వీధి కుక్కలను పట్టుకున్నాయి. ఇటీవల కాలంలో కుక్కల బెడద అధికమైందని, కనపడిన వారిపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయని కార్పొరేటర్లు చేసిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించారు. శానిటరీ అధికారుల పర్యవేక్షణలో శుక్రవారం పలువురు వ్యక్తులు ప్రత్యేక వలలను ఉపయోగించి కుక్కలను పట్టుకున్నారు. వారిని చూసి అప్పటికే పలు కుక్కలు తప్పించుకున్నట్లు కాలనీవాసులు చెబుతున్నారు. తప్పించుకుపోయిన కుక్కలను మరోమారు పట్టుకునేలా చూడాలని అధికారులను ప్రజలు కోరుతున్నారు.

మెరుగైన రిహాబిలిటేషన్ సేవలందించాలి

కాజీపేట అర్బన్: ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన రిహాబిలిటేషన్ సేవలు అందజేయాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన రిహాబిలిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. మెడికవర్ సెంటర్ హెడ్ నమ్రత మాట్లాడుతూ ప్రపంచ స్థాయి రిహాబిలిటేషన్ సేవలను మెడికవర్ ఆస్పత్రిలో అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, అంకేశ్వరపు సురేందర్, వైద్యులు డాక్టర్ షఫీ, కస్తూరి ప్రమీల, దీపక్ పాల్గొన్నారు.

మురుగు నిల్వ ఉండకుండా చూసుకోవాలి

ఖిలా వరంగల్: సీజన్ వ్యాధులు రాకుండా వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని కార్పొరేటర్ మరుపల్లి రవి సూచించారు. 40వ డివిజన్ ఉర్సు కరీమాబాద్‌లో మలేరియా హెల్త్ అసిస్టెంట్ పి.బాబు ఆధ్వర్యంలో మురుగు నీటిలో ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ఇంటిలోని అక్కరకు రాని వస్తువుల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది ప్రదీప్‌రావు, సాయి, ప్రసన్న పాల్గొన్నారు.

నూతన భవనాలు నిర్మించాలి

న్యూశాయంపేట: వరంగల్ జిల్లా వ్యాప్తంగా శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లను తొలగించి వాటి స్థానంలో నూతన భవనాలు నిర్మించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి లాదెళ్ల శరత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ విజయలక్ష్మికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొద్ది రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే, హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దిడ్డి పార్థసారధి, భరత్ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలను ఖండిస్తున్నాం

రామన్నపేట: ఒయాసిస్ పబ్లిక్ స్కూల్ అధ్యక్షుడు జేఎస్ పరంజ్యోతిపై సామాజిక మాధ్యమాల్లో వస్తున్న తప్పుడు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రైవేట్ పాఠశాలల నిర్వహణ సంఘం బాధ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 8న సీనియర్ కేజీ తరగతి గదిలో ఆటిజం సమస్యతో బాధపడుతున్న ఒక విద్యార్థి తరగతి గదిలో నుంచి బయటికి వెళ్లి కింద పడిపోయాడని పేర్కొన్నారు. ఆ సమయంలో తరగతి ఉపాధ్యాయురాలు భావోద్వేగానికిలోనై ఆ విద్యార్థిని కొట్టిందని, దాంతో పాఠశాల యాజమాన్యం చర్య తీసుకొని సదరు ఉపాధ్యాయురాలిని తాత్కాలికంగా సస్పెండ్ చేసిందని తెలిపారు. ఆ విద్యార్థిని పాఠశాల చైర్మనే కొట్టారని కొంతమంది సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు.

కాలనీ కమిటీ ఐక్యతను ఓర్వలేకే..

కాజీపేట రూరల్: 47వ డివిజన్‌లోని ఇంపీరియల్ కాలనీ కమిటీ కార్యవర్గ సభ్యుల ఐక్యత, అభివృద్ధిని ఓర్వలేక కాలనీకి సంబంధం లేని కొంతమంది వ్యక్తులు ఇటీవల తప్పుడు ఆరోపణలు చేశారని కాలనీ కమిటీ అధ్యక్షుడు రామిండ్ల వినయ్, కార్యదర్శి పోగుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోపణలు చేయడం సరికాదని సూచించారు.

సంఘాలకు అతీతంగా కదలి రావాలి

హన్మకొండ: ముదిరాజ్‌లను బీసీ డీ నుంచి బీసీ ఏలోకి మార్చాలని డిమాండ్ చేస్తూ ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేడు (శనివారం) నిర్వహించనున్న ర్యాలీలో సంఘాలకు అతీతంగా ముదిరాజ్‌లందరూ పాల్గొనాలని అసోసియేషన్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పులి రాజేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ జవహర్ కాలనీలోని మెపా రాష్ట్ర కార్యాలయం నుంచి హనుమకొండ గుడిబండల్ ఏనుగులగడ్డ వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కాజీపేట: డివిజన్ అభివృద్ధికి నిధులు కేటాయించి తోడ్పాటు అందిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డికి రుణపడి ఉంటామని కార్పొరేటర్ విజయశ్రీరజాలీ అన్నారు. కాజీపేట 63వ డివిజన్ కృష్ణా కాలనీలో రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నందినూరి కుమారస్వామి, క్రాంతి భరద్వాజ్, సయ్యద్ ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ వైపు యువత చూపు



హన్మకొండ: వికసిత్ భారత్, వికసిత్ తెలంగాణే లక్ష్యంగా నిబద్ధతతో ముందుకు సాగుతున్న బీజేపీ వైపు యువత చూస్తోందని ఆ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ అన్నారు. హనుమకొండ దీన్‌దయాళ్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యాలయంలో పలువురు యువకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ 31వ డివిజన్ అధ్యక్షుడు కడవేరు శ్రీనివాస్, నాయకులు నర్మెట్ట శ్రీనివాస్ రావు గౌడ్, సంద్ర మధు, కేతిపెల్లి సంపత్ రెడ్డి, కూతురు రాజు, అరణ్యారెడ్డి, రుత్విక్, తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞత సభను విజయవంతం చేయండి

కాజీపేట: ఈనెల 22న హైదరాబాద్ రవీంద్ర భారతిలో జరగనున్న కృతజ్ఞత సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. ఈ మేరకు కృతజ్ఞత కరపత్రాలను కాజీపేట మీడియా పాయింట్ ఆవరణలో శుక్రవారం ఆవిష్కరించారు. సమావేశంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ఉసురుపాటి బ్రహ్మయ్య మాదిగ, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఎడ్ల సమ్మయ్య, వరంగల్ ఇన్‌చార్జ్ ఎడ్ల ఉపేందర్, గాదె మైపాల్, కుమ్మరి నాగేశ్వర్ రావు, సంకినేని సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆగిన బస్సు.. ప్రయాణికుల ఆందోళన

కాజీపేట: కాజీపేటలోని ప్రధాన రహదారిపై ఆర్టీసీ బస్సు శుక్రవారం ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. హనుమకొండ బస్టాండు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న వరంగల్ -2 డిపోకు చెందిన బస్సు కాజీపేట బ్రిడ్జి దిగగానే సాంకేతిక లోపం తలెత్తడంతో ఆగిపోయింది. టికెట్ తీసుకున్న ప్రయాణికులు తమను మరో బస్సులో పంపించాలని డ్రైవర్, కండక్టర్‌తో వాగ్వివాదానికి దిగారు. అనంతరం ప్రయాణికులను వేరే బస్సులో గమ్యస్థానానికి పంపించారు.

బాధితుడికి పరామర్శ

హసన్‌పర్తి: అనారోగ్యంతో బాధపడుతూ మరణించిన హసన్‌పర్తికి చెందిన వెంగళ ఎర్రగట్టు కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్ పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



పక్కకు ఒరిగి ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభం

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ యాదవనగర్ పెట్రోల్ పంపు ఎదురుగా (సమ్మక్క పాన్ షాప్ గల్లీ) రెడ్డికాలనీలో విద్యుత్ స్తంభం (ఆర్‌సీహెచ్ 78/2/ఏ) ఒకవైపు ఒరిగి ప్రమాదకరంగా ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు అది రోజురోజుకు కుంగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు కూలుతుందో తెలియక భయాందోళన చెందుతున్నామని చెబుతున్నారు. విద్యుత్ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి దాన్ని తొలగించి కొత్త స్తంభం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.